రిపబ్లిక్ వేడుకలకు వీడీవీకే సభ్యులు

సీతంపేట: న్యూ ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు సీతంపేట ఐటీడీఏ పరిధిలోని వన్‌ధన్ వికాస కేంద్రాల నుంచి ముగ్గురు సభ్యులు బయలుదేరారు. మండలంలోని జక్కరవలసకు చెందిన సవర ప్రేమక్క, భామిని మండలం మనుమకొండకు చెందిన మండంగి మందాకిని, మెళియాపుట్టి మండలం పరసరాంపేటకు చెందిన సవర శాంతితో పాటు ఏపీఎం పార్వతి, మరో ఇద్దరు సహాయకులు ఢిల్లీ పయనమయ్యారు.

గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించండి

సీతంపేట: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకల్లో వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. పీఎం జన్‌మన్, జీసీసీ, వైద్యారోగ్యం, పర్యాటకం, వీడీవీకే, ఐసీడీఎస్, రక్షణ శాఖ స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

అక్షర బ్రహ్మ మందిరం ప్రారంభం

సీతంపేట: మండలంలోని బిల్లగూడలో అక్షరబ్రహ్మ మందిరాన్ని పూజారి ఆనందరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రోజూ మందిరాన్ని దర్శించుకుని పునీతులు కావాలన్నారు. కార్యక్రమంలో ఏవైఎస్ డైరెక్టర్ కె.కామేశ్వరరావు, ఎస్.ముఖలింగం, కరువయ్య, మాలయ్య, ఎస్.రామారావు, గంగారావు, తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తాం

- జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ

సీతంపేట: మీ గ్రామాలకు వచ్చి మరీ అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ తెలిపారు. మండలంలోని లాడ, పాంద్ర గ్రామాల్లో శుక్రవారం పర్యటించి గిరిజనులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అటవీ ఫలసాయాలైన చింతపండు, కొండచీపుర్లు, నల్లజీడి, కరక్కాయలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ కృష్ణ

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

జియ్యమ్మవలస: వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ ఉమా మహేశ్వరరావు తెలిపారు. మండలంలో వివిధ దశల్లో 533 ఇళ్లు ఉన్నాయని, వాటిని మార్చి 31 నాటికి పూర్తి చేసుకోవాలని అన్నారు. బిల్లులలో ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో చెల్లిస్తామని తెలిపారు. శుక్రవారం అర్నాడలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కొత్తగా ఇళ్లు కావాలనుకునేవారు మంజూరు కోసం 2.0 ప్రక్రియ ఈ నెల 31తో ముగుస్తుందన్నారు. అలాగే ఇదివరకు ఇళ్లు కొరకు నమోదు చేసుకున్నవారు కుల, ఆదాయ, పొజిషన్ ధృవపత్రం అందజేయాలన్నారు.

‘ఉపాధి’ పనుల్లో చేతివాటం

జియ్యమ్మవలస: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ బృందం విచారణలో పలు విషయాలను బహిర్గతం చేసారు. ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో వివిధ పంచాయతీలలో క్షేత్ర సహాయకులు, ఇతర సిబ్బంది వేతనదారుల సంతకాలు, వేలిముద్రలు లేకుండా లక్షలాది రూపాయలు చెల్లింపులు జరిపినట్లు తెలిపారు. వేతనదారుల నుంచి వారానికి రూ.100 నుంచి 150 వరకు వసూలు చేసినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ నివేదికలో బహిర్గతం చేసారు. ఎంపీపీ బొంగు సురేష్, ఏపీడీ ఎన్.రమేష్ రామన్, ఏపీడీ శ్రీహరి, విజిలెన్స్ విభాగాధి కారి వెంకటరమణ, ఏపీఓ శ్రీనివాసరావు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోగల ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, అనసభద్ర, కొటికపెంటలో గల కోఎడ్యుకేషన్ పాఠశాలల్లో 30 మంది బాలురు, 30 మంది బాలికలకు ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు.

పక్కాగా సర్వే..

పాలకొండ రూరల్: భూ సర్వే సక్రమంగా చేపట్టాలని సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మంగళాపురంలో కొనసాగుతున్న సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులు, భూ యజమానుల ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట డీటీ సన్యాసిరావు, ఇతర రెవెన్యూ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

పాలకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న చేపట్టనున్న ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాద రాము, దూసి దుర్గారావు, పాపారావు, కె.గోవింద, ఎం. విజయ్, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.